సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



ఈ చిత్రంలోని మహిళ పేరు ప్రభావతి. ఊరు శెట్టూరు మండలం లక్ష్మంపల్లి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన మూడున్నర ఏళ్లల్లో తన కుటుంబానికి రూ. 2,09,350 లబ్ధి చేకూరిందని సంబర పడుతోంది. అమ్మ ఒడి, రైతు భరోసా, పంటల బీమా, సున్నావడ్డీ, ఆరోగ్యశ్రీ, అర్చకుల ఆర్థిక సాయం, ఆసరా తదితర సంక్షేమ పథకాలతో ఆర్థిక స్థితిగతులు మారిపోయాయని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేసింది.

- మంత్రి ఉషశ్రీ చరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో నేతలకు నీరాజనం



శెట్టూరు: లక్ష్మంపల్లిలో మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



బొమ్మనహాళ్: చంద్రగిరిలో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

శెట్టూరు: ప్రజా సంక్షేమ రథసారధి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం కావాలని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి కేవి ఉషశ్రీచరణ్ అన్నారు. ఆదివారం మండలంలోని లక్ష్మంపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన మంత్రికి స్థానిక నాయకులు గజ పూలహారాలతో ఘన స్వాగతం పలికారు. ప్రధాన రోడ్డులో ఉన్న వైస్సార్ విగ్రహానికి మంత్రి పూలహారం వేసి నివాళులర్పించారు. ఉదయం ఏడు గంటలకే మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజా సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేశారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన జగనన్న కావాలా? 600 హామీల్లో ఆరు కూడా నెరవేర్చని చంద్రబాబు కావాలా ? అంటూ ప్రజలను మంత్రి ప్రశ్నించారు. రానున్న ఎన్నికలలో ముఖ్యమంత్రి జగనమోహన్‌రెడ్డికి మనమందరం తోడుందామన్నారు. అన్ని వర్గాలకూ వైఎస్సార్‌సీపీతో న్యాయం జరిగిందన్నారు. లక్ష్మంపల్లిలో సీసీ రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేసి, పేదలకు ఇల్లు ఇచ్చి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే తన లక్ష్యమని, రైతుల క్షేమం కోసం అన్ని చెరువులనూ నీటితో నింపుతామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వి.లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు మంజునాథ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివన్న, మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి, సర్పంచ్‌లు పెరుగు తిమ్మరాజు, చిట్టమ్మ, ప్రకాష్, విరుపాక్షి గౌడ్, నాయకులు ముత్యాలు, హరినాథ రెడ్డి, వన్నూరుస్వామి, ఇమామ్ వలీ, బొమ్మజ్జి రమేష్, రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, జయరామిరెడ్డి, ధనుంజయ, రామలింగారెడ్డి, వెంకటరమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే ప్రభుత్వ ధ్యేయం..

బొమ్మనహాళ్: గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చంద్రగిరి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. విప్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం పేదలకు అందుతున్న పథకాలకు జన్మభూమి కమిటీలతో కోత పెట్టిందన్నారు. అప్పట్లో ఇళ్లను కూడా తెలుగు తమ్ముళ్లు, పార్టీ కార్యకర్తలకే మంజూరు చేశారని, అర్హులకు మొండి చెయ్యి చూపారని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం పేదవాడి గురించి పట్టించుకోకుండా వారిని కేవలం ఓటుకోసం పావుగా వాడుకున్నట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కుటుంబాల్లో ఆనందం చూడాలన్న సంకల్పంతో కనివినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే.. టీడీపీ వాటిని అందకుండా మోకాలడ్డుతున్నట్లు ఆరోపించారు. చంద్రబాబు పేదల పాలిట శాపంగా మారడం రాష్ట్రానికి పట్టిన ఖర్మ అంటూ మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగనన్న ప్రభుత్వం రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జయరామ్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటేశులు, నాయకులు ఆనంద్‌రెడ్డి, వన్నల్లి రామాంజనేయులు, ఆంజనేయులు, రామకృష్ణ, పరమేశ్వర, ముక్కన్న, తిప్పేస్వామి, తిరుమలరెడ్డి, జగదీశ్వరరెడ్డి, హరికృష్ణ, లక్ష్మీకాంత్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, డీలర్ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ వన్నూరుస్వామి, కావలి నాగరాజు, బయిరన్న తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకూ' లక్ష్యం నెరవేరుతోంది

ఉరవకొండ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ లక్ష్యం నెరవేరుతోందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం ఉరవకొండ పట్టణంలోని సచివాలయం-3 పరిధి చౌడేశ్వరీ కాలనీలో రూ.20 లక్షల నిధులతో మంజురైన సీసీ రోడ్లకు ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, వార్డు సభ్యురాలు కణేకల్లు షాహెనాజ్‌లతో కలసి ఆయన రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ గడప గడపలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి నిధులు కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బ్యాంకు ఓబుళేసు, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, నాయకులు రఫీక్, ఈఓ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



చౌడేశ్వరీ కాలనీలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ..

స్థానిక చౌడేశ్వరీ కాలనీలోని 3వ సచివాలయం వద్ద ఏపీటీఎఫ్ 2023 క్యాలెండర్, డైరీలను ఆదివారం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు హనుమప్ప, భాస్కర్, వెంకట్, బండయ్య, దాదాఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కుందుర్పి: దశాబ్దాల కాలంగా తాగునీటి సమస్యతో సతమతమవుతున్న ఎర్రగుంట గ్రామ ప్రజల దాహార్తి తీర్చారు మంత్రి ఉషశ్రీచరణ్. ఎస్‌డీఎఫ్ పథకం కింద రూ.35 లక్షలతో నిర్మించిన మంచి నీటి పథకాన్ని ఆదివారం మంత్రి ప్రారంభించారు.అలాగే మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల్లో రూ.3.50కోట్లతో ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందించే పనులు యుద్ధ ప్రాదిపదికన జరుగుతున్నట్లు మంత్రి తెలిపారు.అడిగిన వెంటనే మంచినీటి పథకానికి నిధులు మంజూరు చేయించిన మంత్రికి సర్పంచ్ విశాలాక్షి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఈ చంద్రశేఖర్, ఏఈ జైపాల్, ఎంపీపీ కమలమ్మ, వైస్ ఎంపీపీ బీజప్ప, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, వైఎస్సార్‌సీపీ మండల కన్వనర్ సత్య నారాయణశాస్త్రి, సింగిల్ విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, నాయకులు రామూర్తి, మర్చంట్ గోపాల్, బొమ్మలింగ, తిప్పేస్వామి, లింగప్ప, రామచంద్ర, జయశింహ, నరసింహప్ప, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగుంటలో మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

ఇమాంషావలి ఉరుసు ప్రారంభం



ఇమాంషావలి సమాధిపై పూలచద్దర్ పరిచిన దృశ్యం



విద్యుద్దీపాల అలంకరణలో దర్గా

కణేకల్లు: హిందూ, ముస్లింలు ఐక్యమత్యంతో జరుపుకునే ఇమాంషావలి ఉరుసు మాల్యంలో ఆదివారం ప్రారంభమైంది. గంధంతో ప్రారంభమైన ఈ వేడుకలు జియారత్‌తో ముగియనున్నాయి. గంధం సందర్భంగా ఇమాంషావలి సమాధిపై వస్త్రాలు, పూలచద్దర్ పరిచారు. ముల్లా పెద్ద ఆదంసాబ్ ఇంటి నుంచి సంప్రదాయబద్ధంగా గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాలోని ఇమాంషావలి సమాధికి సమర్పించారు. విద్యుత్‌దీపాలతో దర్గాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను తిలకించారు. సోమవారం ఉరుసు జరగనుందని నిర్వాహకులు తెలిపారు.



కమలపాడులో సమీపంలో పప్పుశనగ పొలంలో సంచరిస్తున్న జింకలు

పంటలకు జింకల బెడద

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసిన పంటలకు జింకల బెడద ఉండటంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రబీ సీజన్‌లో రైతులు పప్పుశనగ పంటతోపాటు ధనియాలు, మినుములు, పెసలు తదితర పంటలు సాగు చేశారు. అలాగే బోర్లు, బావుల కింద వేరుశనగ, ఇతర కూరగాయల పంటలు సాగు చేశారు. మండలంలో జింకలు సంచారం అధికంగా ఉండటంతో పంటలు దెబ్బ తింటున్నాయని రైతులు వాపోయారు. అటవీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఫిర్యాదు

విడపనకల్లు: విధులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గడేకల్లు పంచాయతీ మజరా గ్రామమైన ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన ఎర్రన్నగారి రామాంజనేయులు, పి.నగేష్, పి.నాగరాజు శనివారం గడేకల్లు సచివాలయం-2లో పని చేస్తున్న ఉద్యోగులతో వాగ్వాదం చేశారు. చాలా రోజులుగా వారు సచివాలయానికి వచ్చి దురుసుగా ప్రవర్తిస్తున్నారని, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా.. సెల్‌ఫోన్‌తో వీడియోలు, ఫోటోలు తీస్తున్నారని మహిళా ఉద్యోగులు ఇంజినీరింగ్ అసిస్టెంట్ మమత, డిజిటల్ అసిస్టెంట్ వాణి, మహిళా పోలీసు అరుణ తదితరులు ఆదివారం 'సాక్షి'తో వాపోయారు. వారిపై చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బంది విడపనకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను కులం పేరుతో దూషిస్తున్న వారిపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శి సోమయ్య కోరారు. పోలీసులు ఎస్. తిమ్మాపురం గ్రామానికి చేరుకుని ఘటనపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

'పొలం సరిహద్దు రాళ్లను తొలగించారు'

కణేకల్లు: మండలంలోని గెనిగెర గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న నా పొలం సరిహద్దు రాళ్లను తొలగించి భూమిని దున్నేశారని, న్యాయం చేయాలని గొడిశెలపల్లికి చెందిన కురుబ రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితునికి కథనం మేరకు.. సర్వే నంబర్ 311, 312లో రాముకు 2.70 ఎకరాల భూమి ఉంది. అదే సర్వే నంబర్‌లో పొలం కలిగి ఉన్న మంజునాథ అనే వ్యక్తి రాము పొలంలో 15 సెంట్ల స్థలం ఉందంటూ తరచూ గొడవపడేవాడు. శుక్రవారం అర్ధరాత్రి రాముకు వ్యతిరేకంగా ఉన్న టీడీపీ నాయకులను తీసుకెళ్లి సరిహద్దు రాళ్లను తొలగించి, పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నేశాడు. ఇది అన్యాయమని రాము భార్య శివగంగమ్మ మంజునాథ వద్ద కెళ్లి గోడు వెళ్లబోసుకోగా 'మీరెన్ని సార్లు సరిహద్దు రాళ్లు పాతినా, జేసీబీతో తొలగిస్తానని, మీ అంతు చూస్తానని బెదిరించాడు' అని బాధితుడు వాపోయాడు. తనకు జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని బాధితుడు కణేకల్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కణేకల్లు: స్థానిక గ్రామ సచివాలయం-3 పరిధిలోని రామనగర్ కొట్టాలలో సోమవారం ఉదయం 7 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి ఆదివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంంలోని అరవకూరు-కమ్మూరు గ్రామాల మధ్య అనంతపురం -బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కూడేరుకు చెందిన మణి, చిన్నా అనే ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్ఐ రామా నాయుడు తెలిపి వివరాలు మేరకు.. ఇద్దరు యువకులు అనంతపురం నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామం కూడేరుకు బయలుదేరారు. ఘటనా స్థలికి రాగానే రోడ్డుపై ఉన్న దున్నపోతును ఢీకొట్టారు. దీంతో దున్నపోతు అక్కడిక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి క్షతగాత్రులను 108లో అనంతపురంలోని ఆస్పత్రికి తరలించి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా దున్నపోతు మృతదేహం, ద్విచక్ర వాహనాన్ని పక్కకు తీయించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం రూరల్: మండలంలోని ఆర్‌బీ వంక (బొందనకల్లు) గ్రామానికి చెందిన శంకర్‌నాయక్ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. అతడి నుంచి 96 టెట్రా ప్యాకెట్ల హేవర్డ్స్ విస్కీ (90 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ఉత్సాహంగా ఆర్‌వైఎస్ఎల్ క్రికెట్ పోటీలు



సెంచరీ సాధించిన గుమ్మఘట్ట లయన్ టీమ్ క్రీడాకారుడు అబ్దుల్లాను అభినందిస్తున్న ఆర్గనైజర్లు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం వైఎస్సార్‌సీపీ యువనేత కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న రాయదుర్గం యూత్ స్పోర్ట్స్ లీగ్ (ఆర్‌వైఎస్ఎల్) సంక్రాంతి క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇప్పటికే మండలస్థాయి క్రికెట్ పోటీలు ముగిసి ఇటీవల నియోజకవర్గస్థాయి పోటీలు జరుగుతున్నాయి. మొత్తం 24 టీమ్‌లు పోటీల్లో ఉన్నాయి. 12 ఓవర్ల మేర జరుగుతున్న క్రికెట్‌లో ఆదివారం గుమ్మఘట్ట లయన్స్, గోనేహాళ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలిసారిగా సెంచరీ నమోదైంది. గుమ్మఘట్ట లయన్స్ జట్టు గెలిచిన ఈ మ్యాచ్‌లో అబ్దుల్లా 43 బంతుల్లో 101 పరుగులు సాధించి శభాష్ అనిపించాడు. అబ్దుల్లాను ఆర్గనైజర్లు నాగరాజు(ఓబ), బషీర్, మురళి, నగేష్ క్రీడాకారులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఉరవకొండ: స్థానిక ఎంపీయూపీ సెంట్రల్ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిరనిర్వహించారు. స్థానిక ఉరగాద్రి ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమ్మేళనంలో 1976-1983లో 1వ తరగతి నుంచి 7వ తరగతి చదివిన విద్యార్థులు కలిశారు. ఈసందర్భంగా అప్పటి గురువులకు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించారు. అనంతరం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకుని రోజంతా ఆనందంగా గడిపారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ




సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: కూడేరు మండలం కడదరకుంట గ్రామానికి చెందిన అవిలికొండ ఉమాదేవికి సీఎం సహాయ నిధి చెక్కు మంజురైంది. ఆదివారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని ఎమ్మెల్సీ స్వగృహంలో బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. 'ఆరోగ్యశ్రీ' కింద రాని వ్యాధులకు సంబంధించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎర్రిస్వామి, రామకృష్ణ, కొండన్న, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ ప్రయోజనకరం

ఉరవకొండ రూరల్: రబీలో సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్ చేయించుకుంటే రైతులకు ప్రయోజనంగా ఉంటుందని వ్యవసాయ అధికారిణి శశికళ తెలిపారు. ఆదివారం మండలంలోని రాకెట్ల గ్రామంలో వైస్ ఎంపీపీ శ్రీనాథ్ రెడ్డి సాగుచేసిన పప్పుశనగ పంటలో రైతులతో కలసి ఈ-క్రాప్ బుకింగ్ చేశారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతూ ఈ-క్రాప్ చేయించుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే పరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో పెన్నహోబిలం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అశోక్, నాయకుడు నాగరాజు, ఆదర్శ రైతు శ్రీనివాసులు, రైతులు ఆదెప్ప, హరిహరరెడ్డి, పాండురంగ, లింగప్ప, రారాజు, వెంకటేశులు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని హటకేశ్వర స్వామి దేవాలయంలో స్వకుళ సమాజ శ్రీరాజ రాజేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. జూనియర్, సీనియర్స్ విభాగాలవారిగా పోటీలు నిర్వహించారు. మహిళా మండలి అధ్యక్షురాలు విమల, కార్యదర్శి సరస్వతి, సహ కార్యదర్శి శ్రీదేవి, ఉపాధ్యక్షురాలు చంద్రకళతోపాటు ముఖ్య అతిథులుగా నగేష్, సరస్వతి, తారాకుమారి హాజరై ముగ్గులను పరిశీలించి విజేతలు ఎంపికచేశారు. జూనియర్ విభాగంలో దీపిక, గాయత్రి, అశ్వని, సీనియర్స్ విభాగంలో హేమలత, సుజాత, యమున విజేతలుగా నిలిచారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు.

కేబుల్ చోరీలతో రైతుల బెంబేలు

గుమ్మఘట్ట: మండలంలో వరుస కేబుల్ చోరీలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. కె.పి.దొడ్డి గ్రామ సమీపంలోని గొనిగుంట క్రాస్ వద్ద గ్రామస్తుల దాహార్తిని తీర్చడానికి పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన 70 మీటర్ల కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి అపహరించారు.అలాగే కె.పి.దొడ్డి గ్రామానికి చెందిన గొల్ల బాలప్ప, బ్రహ్మప్ప, రంగసముద్రం గ్రామానికి చెందిన శివకుమార్, కెంచప్పకు చెందిన తోటల్లో మోటార్లకు అమర్చిన కేబుల్ సైతం చోరీ చేశారు. దొంగతనాలు రోజురోజుకూ అధికం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దొంగలించిన వైర్లను మంటల్లో కాల్చి కాపర్‌ను గుజరీ షాపుల్లో విక్రయిస్తూ కొందరు జల్సాలకు పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. చోరీలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. పోలీసులు నిఘా వుంచి దొంగతనాలకు పాల్పడేవారిని గుర్తించి, న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

నడిరోడ్డుపై నీటి లీకేజీ



మెయిన్‌రోడ్డులో పైప్‌లైన్ పగిలి లీకేజీ అవుతున్న నీరు

కణేకల్లు: కణేకల్లు-కణేకల్లుక్రాస్ మార్గంలో హెచ్చెల్సీ కాలువ వద్ద నడిరోడ్డున ఏర్పడ్డ నీటి లీకేజీ గుంత ప్రమాదాలకు కేంద్రబిందువుగా మారింది. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకానికి సంబంధించిన పైప్‌లైన్ నాలుగు నెలల క్రితం పగిలిపోయింది. అప్పటి నుంచి తాగునీరు లీకవుతూనే ప్రధాన రహదారిపై గుంత ఏర్పడింది. లారీ, బస్సులు, ఇతర వాహనాలు ఒక్కోసారి వేగంగా వచ్చి ఇక్కడ ఇరుక్కుపోతున్నాయి. ఆరు రోజుల క్రితం వరిధాన్యం లారీ ఇక్కడ బోల్తా పడింది. వారంలో రెండు మూడు వాహనాలు బోల్తా పడటం పరిపాటిగా మారింది. పైప్‌లైన్‌ను మరమ్మతు చేసి లీకేజీని అరికట్టాల్సిన సంబంధితాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు.

అక్రమాలపై చర్చకు సిద్ధమా!

రాయదుర్గం: అవినీతి, అక్రమాలపై చర్చకు కాలువ శ్రీనివాసులు సిద్ధమా అని మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, డి హీరేహాళ్ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి ప్రశ్నించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి కాలవ చేపట్టిన పాదయాత్రలో తాము కూడా పాల్గొంటామన్నారు. తిమ్మాలాపురం వద్దకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పార్టీ ముఖ్య నాయకులతో కలసి వెళ్తామన్నారు. ఎవరి హయాంలో ఎంత మేర తవ్వకాలు చేపట్టారో ప్రజల సమక్షంలోనే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. అభివృద్ధి పనులకు మాత్రమే ఇసుక తవ్వుకున్నామని, మీలా సరిహద్దులు దాటించిన నైజం తమకు లేదన్నారు. కాలవ తాటాకు చప్పుళ్లకు భయపడే వారు ఎవరూ లేరని వారు ధ్వజమెత్తారు.

కాలవ పాదయాత్రకు అనుమతి లేదు

- సీఐ యుగంధర్

రాయదుర్గం: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు తలపెట్టిన పాదయాత్రకు పోలీసు అనుమతి నిరాకరించామని రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాదయాత్రలో పాల్గొనే వారి పేర్లు, ఎన్ని గంటలు, ఏఏ గ్రామాలు, ఏ రోడ్డులో చేస్తారనే వివరాలు పోలీసులకు ఇచ్చిన దరఖాస్తులో లేవని స్పష్టం చేశారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందుకు డీఎస్పీ అనుమతి పొందాల్సి ఉందన్నారు. ముందస్తు పోలీసు అనుమతులు పొందకుండా పాదయాత్ర చేపడుతున్నట్టు పత్రికల్లో ప్రకటించారన్నారు. ఈ పాదయాత్రను అడ్డుకుంటామని మరో రాజకీయ పార్టీ నాయకులు కూడా ప్రకటించడంతో శాంతిభద్రతల దృష్ట్యా అనుమతి నిరాకరించామన్నారు. మాజీ మంత్రి పాదయాత్ర చేపట్టే రహదారులు కూడా పూర్తి ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నట్టు గుర్తించామన్నారు. అనుమతి పొందకుండా పాదయాత్ర చేపడితే చట్టరీత్యా కఠినచర్యలు చేపడతామని సీఐ హెచ్చరించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌డబ్ల్యూఏ చైర్మన్ నియామకం

రాయదుర్గంటౌన్: జాతీయ మానవ హక్కుల వెల్ఫేర్ అసోసియేషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌డబ్ల్యూఏ) జిల్లా చైర్మన్‌గా జక్కుల భాస్కర్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు వడ్డే సురేంద్ర, వెంకటేశ్వర్లు, సాయి రామచంద్రారెడ్డి నియామక పత్రాన్ని పంపినట్లు భాస్కర్‌యాదవ్ తెలిపారు. ఆయనను రాయదుర్గంలో ఆదివారం సన్నిహితులు, కౌన్సిలర్లు సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, కౌన్సిలర్లు డిష్ గోవిందు, పెద్ద వన్నూరుస్వామి, వార్డు ఇన్‌చార్జ్‌లు గంగాధర్, తిమ్మరాజు, గోరంట్ల సత్యానారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, కొండాపురం రామన్న తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ ఆలయానికి విరాళం



కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామ పంచాయతీ పరిధిలోని మజరా గ్రామమైన వైద్యం గుండ్లపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న మారెమ్మ ఆలయ నిర్మాణానికి సర్పంచ్ ఉమేష్ రూ.10,116 వితరణ చేశారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తరపున నగదును గ్రామప్రజల సమక్షంలో ఆలయకమిటీ సభ్యులకు అందించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తయ్య, అంజి, ధనుంజయ, రామాంజనేయులు, జయరామిరెడ్డి, బేలోడు రామాంజనేయులు, కాసీం తదితరులు పాల్గొన్నారు.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానికులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

వజ్రకరూరు: మండలంలోని పందికుంట గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుపతి రాజు(35) గుండెపోటుతో మృతిచెందాడు. సాయంత్రం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి తోపాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.